## విలేకరులు కావలెను

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

గురువారం 3.04.2025 | సంపుటి: 03 | సంచిక: 86 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్




## నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

**రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు**

**మెదక్, నిజామాబాద్ నేతలకు కేసీఆర్ సూచన**

**గజ్వేల్,ఏప్రిల్2:**

భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమవేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు.ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,

మిగతా 2వ పేజీలో..



## మెదక్ జిల్లా నేతలతో కేసీఆర్ భేటీ

**పార్టీ రజతోత్సవ వేడుకలపై సూచనలు**

**నియోజకవర్గం నుంచి లక్ష మంది..**

**27న వరంగల్‌లో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు**

2



# బీసీ రిజర్వేషన్ పై ఇక ధర్మయుద్ధమే

## 42% పెంచుతూ మేం తీర్మానం చేశాం

**ఇప్పుడు బీజేపీ వంతు వచ్చింది**

**కేంద్రం ముందు జనాభా లెక్కల సంగతి తేల్చాలి**

**గాంధీ మాట ప్రకారం తెలంగాణలో మొట్టమొదటి సారి కులగణన**

**మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే**

**చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు**


**ఢిల్లీ ధర్నాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



**ఢిల్లీ,ఏప్రిల్2:**

బీసీలకు రిజర్వేషన్ 42శాతం పెంచుతూ తెలంగాణ తీర్మానం చేసిందని ఆ బిల్లును కేంద్రం ఆమోదించాలని లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇవాళ ఢిల్లీ లోని జంతర్‌మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధనకు చేపట్టిన బీసీ సంఘాల ధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా లెక్క తేలాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్

మిగతా 2వ పేజీలో..



పలు జిల్లాలకు వర్ష సూచన 2



ముగిసిన పదో తరగతి పరీక్షలు 2




ప్రియుడి మోజులో కన్న పిల్లల్ని కడతేర్చింది 3



## హెచ్‌సీయూ భూముల్లో చెట్లు నరకొద్దు

**ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు**

**భూములపై విచారణ నేటికి వాయిదా**



**హైదరాబాద్,ఏప్రిల్2:**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరపున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ

మిగతా 2వ పేజీలో..



## లోక్‌సభలో వక్ఫ్‌చట్ట చట్ట సవరణ బిల్లు

- చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు
- లేకుంటే పార్లమెంటు స్థలం కూడా వక్ఫ్‌దే అంటారు
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్2:**

వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట

మిగతా 2వ పేజీలో..

## ప్రొఫెసర్లపై లాఠీచార్జి బాధాకరం

- రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, ఏప్రిల్2:**

విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిరచారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా

మిగతా 2వ పేజీలో..

## తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

- భూములు కాపాడటంలో బీఆర్ఎస్ ఎంతో శ్రమించింది
- రేవంత్‌కు పాలన చేతకావడం లేదు : ఎమెల్సీ కవిత

**హైదరాబాద్, ఏప్రిల్2:**

సీఎం రేవంత్ పాలన ఎవరికి అర్థం కావడం లేదని.. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్న సీఎం ఆయనే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారు అని ఆమె అన్నారు. బుధవారం ఆమె మీడియాలో మాట్లాడుతూ హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూమిని కాపాడిరది బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..



## ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

- 30 వరకు పెంచుతూ ఆదేశాలు
- 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం
- పురపాలక శాఖ ఆదేశాలు జారీ

2



# పలు జిల్లాలకు వర్ష సూచన

### వెల్లడించిన వాతావరణశాఖ

**హైదరాబాద్, ఏప్రిల్2:**
మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ (బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా.. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం గరిష్టంగా ఆదిలాబాద్‌లో 41 కనిష్టంగా రామగుండంలో 35.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళవారం తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది.

# ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

- **30 వరకు పెంచుతూ ఆదేశాలు**

**హైదరాబాద్,ఏప్రిల్2:**
తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ పక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధి కారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండిరగ్‌లో ఉంది. వీటితో పాటు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రోసీడిరగ్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడిరచాయి. ఇక ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది.
అలాగే ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్ఆర్ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్ఆర్ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

# మెదక్ జిల్లా ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

- **పార్టీ రజతోత్సవ వేడుకలపై సూచనలు**

**హైదరాబాద్, ఏప్రిల్2:**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆ పార్టీ రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్య నేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో ఉమ్మడి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ నేతలతో సమావేశం అయ్యారు. కేటీఆర్, హరీష్‌రావుతో పాటు సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా కీలక నేతలు హాజరయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశం పెట్టుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి లక్ష మందికి తగ్గకుండా లక్షలాది మందితో సభ నిర్వహించేలా ప్లాన్ ఉండాలన్నారు. ఆ దిశగా ఫామ్ హౌస్‌కు చేరుకుంటున్న బీఆర్ఎస్ మాజీ తాజా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ లు. ముఖ్య నేతలకు కేసీఆర్ సూచనలు చేస్తున్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో నిన్న కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై వరంగల్ జిల్లా నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ స్థాపించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ నాయకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

**మొదటి పేజీ తరువాయి**
అని ఆమె పేర్కొన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారన్నారు. ఇది యూనివర్సిటీ భూమి అని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళవద్దన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని మండిపడ్డారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవచ్చు కదా..? ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలి అని కవిత సూచించారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో వాస్తవం లేదన్నారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని అన్నారు.



# నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

**మొదటి పేజీ తరువాయి**
ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్‌పై ఇక ధర్మయుద్ధమే

**మొదటి పేజీ తరువాయి**
గాంధీ దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. జనాభా లెక్కలు తెలియకపోతే రిజర్వేషన్లు ఇచ్చేందుకు లేదని కోర్టులే చెప్పాయని తెలిపారు. దీంతో జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని రేవంత్ ఆరోపించారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చింది. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు.రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించాం.రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారం. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ (మోదీ) రాష్ట్రంలో చేయమని మేము అడగలేదని సీఎం గుర్తు చేశారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు.



అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు "అయిననూ హస్తిన పోయి రావలె".. ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు?దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నామన్నారు.రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారని ఆరోపించారు.ట్రిపుల్ తలాఖ్ తెచ్చారు. ఆర్టికల్ 370 రద్దు చేశారు. వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చింది? అంటూ నరేంద్ర మోదీని సీఎ నిలదీశారు.బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారు. మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు అంటు గుర్తు చేశారు. ?మీరు మా డిమాండ్లకు దిగి రావాలి. లేదంటే మీరు దిగిపోవాలి, బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలి. నరేంద్ర మోదీ గారు వినండి. మేము ఇక ఢిల్లీకి రాం. మీరే మా గల్లీకి రావాలంటూ సంచలన ప్రకటన చేశారు సీం రేవంత్ రెడ్డి,. కురుక్షేత్ర యుద్ధంలో 5 గ్రామాలు ఇవ్వాలని సంధి ప్రయత్నం జరిగింది. కానీ దుర్యోధనులు వినలేదు. తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. మేము కూడా ఇప్పుడు సయోధ్యకు వచ్చాం. మా రిజర్వేషన్ల పెంపునకు ఆమోదం చెప్పండి లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రవంత్ రెడ్డి హెచ్చరించారు.




# హెచ్‌సీయూ భూముల్లో చెట్లు నరకొద్దు

**మొదటి పేజీ తరువాయి**
చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 582003లో నాడు ఎకరా భూమిని రూ.50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ.26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ.50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిఫై చేయలేదన్నారు. ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు. ఇది కేవలం ఇండస్ట్రీ భూమి మాత్రమేనని.. ఇది ఫారెస్ట్ ఏరియా మాత్రం కానే కాదని ఆయన వివరించారు. ఇక్కడ హెలిప్యాడ్‌లు సైతం నిర్మించారని గుర్తు చేశారు. డిఫెన్స్ మినిస్టర్ వచ్చినా ఇక్కడే హెలికాప్టర్ ల్యాండ్ అవుతుందని కోర్టుకు ఆయన విన్నవించారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ కేసును విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వరకు ఆ భూమిలో ఎటువంటి చెట్లు నరకవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# లోక్‌సభలో వక్ఫ్‌చట్ట చట్ట సవరణ బిల్లు

**మొదటి పేజీ తరువాయి**
సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఏ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడిరచారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య



ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకువస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ సభ్యులు గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ.. ఈ బిల్లుపై తప్పు దొవ పట్టించే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతేకాకుండా.. ఈ బిల్లు సవరణలు సమర్పించడానికి ఒక ఏడాది ముందు, 2023లో జరిగిన పార్లమెంటరీ కమిటీ నాలుగు సమావేశాలు జరిగాయని.. వాటిలో దేనిలోనూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ బిల్లును ఎందుకు ప్రస్తావించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని రంజన్ గొగోయ్ సూటిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పై విధంగా స్పందించారు.

## ప్రొఫెసర్లపై లాఠీచార్జి బాధాకరం

**మొదటి పేజీ తరువాయి**
ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. రేవంత్ సర్కార్ వల్ల ఏ వర్గం ప్రశాంతంగా లేదని విమర్శించారు. మొన్నటి నుంచి మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్.. ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ముగిసిన పదో తరగతి పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్2 :**
విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి.టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరివారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి. వాటికి కొద్ది మంది మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
ఏప్రిల్ 3, 2025
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# ప్రియుడి మోజులో కన్న పిల్లల్ని కడతేర్చింది

- పెరుగన్నం తినకపోవడంతో బయటపడ్డ భర్త
- అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును ఛేదించిన పోలీసులు





హైదరాబాద్, ఏప్రిల్2: వివాహేతర సంబంధాల కోసమే ఎంతకైనా తెగిస్తున్నారు. కట్టుకున్న భర్త, కన్న పిల్లలను సైతం చంపటానికి వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలోనే అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును పోలీసులు ఛేధించారు. ముగ్గురు పిల్లల మృతి కేసులో తల్లే విలన్ అని గుర్తించారు. విషం పెట్టి కడుపున పుట్టిన ముగ్గురు పిల్లలను తల్లే పాశవికంగా అంతమొందించినట్లు తేల్చారు. వివాహేతర సంబంధం మోజులో ముగ్గురు పిల్లలను హత్య చేసిందని నిర్ధారించారు. గత నెల 27న పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టిందని.. తాను కూడా భోజనం చేసి అస్వస్థతకు గురైనట్టు నాటకం ఆడిరదని పోలీసులు తేల్చారు. విచారణలో నిజం బయటపడటంతో తల్లి రజితను అరెస్ట్ చేశారు. భర్తను కూడా చంపాలని ఆమె డిసైడయ్యింది. అయితే అతను పెరుగన్నం తినకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ శివారు అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చాలా సంచలనం సృష్టించింది. ముందుగా భర్తను అనుమానించారు పోలీసులు. లోతైన దర్యాప్తు తర్వాత భార్య రజిత బాగోతం బయటపడిరది. కొన్నాళ్ల క్రితం రజిత టెన్త్ క్లాస్‌మేట్స్ గెట్ టుగెదర్‌కు వెళ్లింది. అక్కడ ఓ స్నేహితుడితో పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారనే కారణంతో వాళ్లను చంపాలని ప్లాన్ చేసింది. ఫిబ్రవరి 27 శుక్రవారం రాత్రి పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టి తినిపించింది. భర్త చెన్నయ్య ఆరోజు పెరుగు తినకుండా భోజనం ముగించాడు. తర్వాత వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్ పనిపై బయటకు వెళ్లిపోయాడు. తిరిగొచ్చాక చూస్తే పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారు. ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. 12 ఏళ్ల సాయికృష్ణ, 10 ఏళ్ల మధు ప్రియ, 8 ఏళ్ల గౌతమ్ మృతితో తీవ్ర విషాదం నెలకొంది. ఎందుకిలా జరిగిందో తనకు తెలియదని, తాను కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యానని రజిత చెప్పడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడు భర్త. చివరికి విచారణలో ప్రియుడితో కలిసి రజిత చేసిన ఘోరం బయటపడిరది. రజితతోపాటు ఆమె ప్రియుడూ ఇప్పుడు పోలీసుల అదుపులో ఉన్నారు. వివాహేతర సంబంధం మోజులో పడి కడుపున పుట్టిన బిడ్డలను చంపుకోవటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఆమెకు కఠిన శిక్ష వేయాలని కోరుతున్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

## పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2:** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసేందుకు తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పౌర విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకరించింది. భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు రావడంపై జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పరిగణలోకి తీసుకుంది. పౌర విమానయానానికి, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగు ణంగా జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచిం చింది. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం, పౌర టర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ , ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఏఐఎఫ్ డైరెక్టర్ లేఖ రాసింది. మరోవైపు.. వరంగల్ నగర సమీపంలోని మామూనూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి, విమాన సర్వీ సుల పునరుద్ధరణకు అడ్డంకులు తొలగిపోయిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్టు ఉండకూడదనే నిబంధన రద్దయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (హెచ్‌ఏఐఎల్)ను నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో ఒప్పందం అనంతరం ఈ నిర్ణయం జరిగిందని పేర్కొన్నది. రాష్ట్రంలో మరో రెండు విమానాశ్రయలు నిర్మాణం కానుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఔదార్యంలో రతన్ టాటా టాప్

- ఆస్తిని అందరికి పంచిన తీరు అభినందనీయం
- వీలునామాలో ప్రకటించిన తీరుపై సర్వత్రా చర్చ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2:** భారత దేశం ఉన్నంత కాలం రతన్ టాటా పేరు చిరస్మరణీయంగా ఉంటుంది. అంతటి సేవా గుణానికి ప్రతీక ఆయన అని వేరుగా చెప్పనక్కరలేదు. బతికుండగానే దేశం కోసం ఎన్నో త్యాగాలను చేశారు. ఎంతో సేవ చేశారు. దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందేందుకు అనేక చర్యలు తీసుకున్న పారిశ్రామికవేత్తగా పేరు గడిరచారు. గతేడాది చనిపోయిన రతన్ టాటా ఔదార్యం మరోసారి వెల్లడైంది. తన వీలునామాలో రూ. 3800 కోట్ల ఆస్తిని దాతృత్వానికి ఇచ్చారు. ఆస్తుల్లో సింహభాగాన్ని ఛారిటీలకు కేటాయించారు. మిగిలిన దానిని కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగులు, జంతువుకు చెందేలా వీలునామా రాశారు. రతన్ టాటాకు రూ. 10 వేల కోట్ల ఆస్తులు ఉండగా, రూ. 3800 కోట్లను దానధర్మాలకే వినియోగించారు. రతన్ టాటా గతేడాది అక్టోబర్ 9 మరణించారు. ఆయన వీలునామా తాజాగా వెలుగులోకి వచ్చింది. తన ఆస్తిలో చాలా ఎక్కువ భాగాన్ని రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్‌లకు కేటాయించారు. షేర్లు, ఇతర పెట్టుబడులు, ఆస్తులు దాతృత్వానికే చెందుతాయని వీలునామాలో పేర్కొన్నారు. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు-, స్టాక్స్ మొత్తం రూ. 800 కోట్లలో మూడోవంతును తన సవతి తల్లి కుమార్తెలైన షరీన్ జేజీబాయి, డియాన్నా జేజీబాయికి రాశారు. రూ. 800 కోట్లలో మూడో వంతును టాటా మాజీ ఉద్యోగి, అత్యంత ఆప్తుడైన మోహిని ఎం దత్తాకు ఇచ్చారు.తన ప్రాణ స్నేహితుడైన మెహ్లీ మిస్త్రీకి అలీబాగ్‌లో ఇంటిని, మూడు తుపాకులను ఇచ్చారు. తన పెంపుడు జంతువుల కోసం ఆయన రూ. 12 లక్షలు కేటాయించారు. తన వద్ద ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా పనిచేసిన శంతను నాయుడికి ఇచ్చిన ఎడ్యుకేషన్ లోన్‌ని మాఫీ చేశారు. పొరుగింటి వ్యక్తి జేక్ మాలైట్ కు ఇచ్చిన వడ్డీ లేని రుణాన్ని మాఫీ చేశారు. ఇదిలా ఉంటే తన వద్ద పనిచేసని వంటవాడిని కూడా రతన్ టాటా మరిచిపోలేదు. తనకు ఎప్పటి నుంచో వండిపెడుతున్న కుక్ రజన్ షాకు రూ. 1 కోటి ఇచ్చాడు. ఇంటి పనులు చేసే సుబ్బయ్యకు రూ. 66 లక్షలు, సెక్రటరీ డెల్నాజ్‌కి రూ. 10 లక్షలు ఇవ్వాలని వీలునామాలో పేర్కొన్నాడు. ఇప్పుడా వీలునామపై సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఆయన ఔదార్యాన్ని శ్లాఘిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

- క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,ఏప్రిల్ 2 :** వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. అక్కడక్కడా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నా ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా ఉంటోంది. వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడుతున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో పలు ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగు తాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్టాల్రకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్టాల్ర్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నా యంటే సూర్యుడి విశ్వరూపం అర్థంచేసుకోవచ్చు. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ రెండో వారం తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కూలర్లు, ఎసిల మోతలు వినిపిస్తున్నాయి. సాధారణం కంటే 2,3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్టాల్ర్లో వడగాల్పులు ప్రభావం ఉంటుం దని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో క్రమంగా ఉష్ణోగ్రతల పెరుగుదల కనినిస్తోంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

## ఖాళీ జాగాలో చెట్లు పెరిగితే అడవి అవుతుందా?

- హెచ్‌సియూ భూముల్లో ఇంచు కూడా తీసుకోలే: జూపల్లి

**హైదరాబాద్,ఏప్రిల్ 2 :** సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. హెచ్‌సీయూలో ఒక్క ఇంచు భూమి కూడా తీసుకోలేదని తేల్చి చెప్పారు. అయితే, ఒక ప్రైవేట్ కంపె నీకి భూమి పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడిరదని పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీకి 400 ఎకరాలు వెళ్తే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది అనిపించలేదు అన్నారు. ఇక, హెచ్‌సీయూలో చెట్లు- పెరిగితే అడవి అయిపోతుందా అని ప్రశ్నించారు. ఇక, 20 సంవత్సరా ల నుంచి పడావుగా ఉన్న భూమిలో చెట్లు- పెరుగు తాయి కదా అని మంత్రి జూపల్లి తెలిపారు. పులులు, జింకలను ఇబ్బంది పెడుతున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తపన పడుతున్నారు అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఇక్కడ భూమి తీసుకున్నం దుకు మరో చోట భూమిని యూనివర్సిటీ-కి ఇచ్చారని తెలిపారు. 400 ఎకరాల భూమి వెనక పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారు.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు అని ఆయన ఆరోపించారు.

## మూసీ పరిసరాల్లో నిర్మాణాలపై ఆంక్షలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,ఏప్రిల్ 2 :** మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అక్కడ అనేకులను ఖాళీ చేయించిన ప్రభుత్వం తాజాగా మూసీ పరిసరాల్లో నిర్మాణాల నియంత్రణకు చర్యలు చేపట్టింది. మూసీ పరిసరాల్లో ప్రణాళికా రహిత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంది. ఇందుకోసం నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జేఎండీ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ చీఫ్ ప్లానర్, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మూసీకి 50 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. 50 నుంచి 100 మీటర్ల వరకు కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు, కమిటీ క్లియర్ చేసేంత వరకు ఏవిధమైన కొత్త అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం ఆదేశించింది. మూసీ కి 100 మీటర్ల వరకు ప్రభుత్వ పనులు చేపట్టా లన్నా ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేసింది.

# దయచేసి ఆ భూములను కాపాడండి

- సిఎం రేవంత్‌కు రేణూదేశాయ్ వినతి

**హైదరాబాద్ ,ఏప్రిల్ 2:** కేంద్రీయ విశ్వవిద్యాలయం సమీపంలోని 400 ఎకరాల భూములపై హెచ్‌సీయూ, తెలంగాణ ప్రభుత్వం మధ్య వివాదం రోజు రోజుకు ముదురుతోంది. ఆ భూముల్లో ఎన్నో వన్యప్రాణులు జీవిస్తున్నాయి. అక్కడి భూమిలోని చెట్ల నరికివేతను ఆపాలని విద్యార్థులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అలాగే మరోవైపు జంతువులు, పర్యవరణానికి ప్రమాదం తేవద్దంటూ పలువురు టాలీవుడ్ సెలబ్రెటీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులకు మద్దతు తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ లు చేస్తున్నారు. తాజాగా ఈ వివాదంపై సినీనటి రేణుదేశాయ్ స్పందిస్తూ ' సీఎం రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వ కంగా చేస్తున్న ఓ విన్నపం. నాకు రెండు రోజుల క్రితం ఈ భూముల వ్యవహారం గురించి తెలిసింది. అందుకు సంబంధించి కొన్ని విషయాలు కనుకున్నాను. రేవంత్ రెడ్డి గారు మీకు ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను, నాకు ఇప్పుడు 44 సంవత్సరాలు రేపో మాపో చనిపోతాను. కానీ నా పిల్లలు అలాగే మనఅందరి పిల్లలకు ఆక్సిజన్ అలాగే త్రాగు నీరు కావాలి. ఆవును మాకుఅభివృద్ధి కూడా కావలి, మాకు ఐటి పార్క్స్, భారీ భవనాలు, వరల్డ్ క్లాస్ సదుపాయాలు కావాలి. కానీ ఈ 400 ఎకరాల ప్రకృతిని, ఫారెస్ట్ ను ధ్వసం చేయకుండా ఆపడానికి మీకు ఏదైనా అవకాశం ఉంటే వెంటనే ఆపేయండి. మీరు పరిపాలిస్తున్నఈ రాష్ట్ర సిటిజన్‌గా అడుగుతున్న ఎదో ఒకటి చేయండి. మన దగ్గర ఎన్నో ఇతర భూములు ఉన్నాయి. మీరందరు నాకంటే ఏంతో సీనియార్స్. మీకు నాకంటే ఏంతో అనుభవం ఉంది. ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను. ఇందులో నా స్వార్థం లేదు. ప్లీజ్ ఒకసారి ఆలోచించండి. గతంలో జరిగిన అబివృద్ధి వలనే ఈ రోజు మనం ఇక్కడ ఉన్నాం. కానీ ఆ 400 ఎకరాలు దయచేసి వదిలేయండి. ఒక తల్లిగా అభ్యర్థిస్తున్నాను సదరు అధికారులు ఈ విషయంలో మరోసారి ఆలోచించండి. ఈ నిర్ణయాన్నివెనక్కి తీసుకుంటే మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విన్నవిస్తూ రేణుదేశాయ్ వీడియో రిలీజ్ చేసారు.

# అడవుల్లో వన్య ప్రాణుల ఘోష వినపడటం లేదా?

- హెచ్ సీయూ ఘటన ఫలితం రేవంత్ అనుభవిస్తాడు
- రేవంత్ ను జైలులో పెడితే కానీ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండదు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్ ,ఏప్రిల్ 2:** ఎంతమంది మేధావులు, విద్యావంతులు హెచ్చరిస్తున్నా హెచ్‌సీయూ భూములను లాక్కుకుంటున్నారని.. ఇది ఫలితం రేవంత్‌రెడ్డి తప్పక అనుభవిస్తాడని ఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హెచ్‌సీయూ బయో డైవర్సిటీ పార్క్ విధ్వంసం, భూముల కుంభకోణంలో కాంగ్రెస్ గుంట నక్కల ముఠాపై వెంటనే సుమోటోగా కింది కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 29, అటవీ సంరక్షణ చట్టం 1980లోని సెక్షన్ 2, తెలంగాణ వాల్టా చట్టం 2002లోని సెక్షన్ 35 కింద కేసులు నమోదు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, అతనికి సహకరిస్తున్న మంత్రులందరిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి. అప్పుడే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఊర్లలో ఎడ్ల బండి మీద ఇల్లు కట్టడానికి వాగు నుండి తట్ట ఇసుకను తీసుకపోతే ఆ బండిని సీజ్ చేసి స్టేషన్‌లో పెట్టే పోలీసులు, రెవెన్యూ అధికారులకు.. అడవిలో వన్యప్రాణుల ఘోష వినిపించడం లేదా..? బుల్డోజర్లు కనిపించడం లేదా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఎక్కడ? విద్యార్థులను కిరాయి ఉద్యమకారులన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి రియల్ దందాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కడుతున్న కట్టడాలను ప్రజలు ఎవరూ కొనకుండా బహిష్కరించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

- విద్యార్థులను చితకబాదిన పోలీసులు

**హైదరాబాద్ , ఏప్రిల్ 2 :** హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వా నికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపు తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.



## ఇంటర్ కాలేజీలకూ జూన్ 1 వరకు సెలవులు

- సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు: బోర్డు

హైదరాబాద్,ఏప్రిల్2 :తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈ సెలవులు మార్చి 30 నుంచి ప్రారంభమై జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు వేసవి సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రయోజనకరమైన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించింది. జూన్ 2నుంచి తరగతులు మళ్లీ ప్రారంభమవు తాయని ఇంటర్ బోర్డు వెల్లడిరచింది. అలాగే, సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## సన్న బియ్యం పంపిణీ



**ఆర్మూర్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ ఆవరణలో గల రేషన్ దుకాణంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సడక్ వినోద్ బుధవారం రోజు పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రజలకు దృష్టిలో పెట్టుకొని ఎన్నికలు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేస్తుందన్నారు. ఎన్నికల్లో సన్న బియ్యం ఇస్తామని చెప్పలేదు కానీ రెవెన్యూ సర్కార్ పేద ప్రజలకు సన్న బియ్యం పథకం అమలు చేసినందుకుగాను పేద ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ సాధక బాధకాలు అర్థం చేసుకునే రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడప గడపకు తిరిగి పథకాల వివరణ



**ఆర్మూర్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెద్ద బజార్ 30వ వార్డులో బుధవారం రోజు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, నాగేష్ రెడ్డిలు విచ్చేసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు అంద బోయే పథకాల గురించి నాయకులు కార్యకర్తలు అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి 30 వార్డులో ప్రతి గడపగడపకు తిరిగి సబ్సిడీ పథకాల గురించి వివరిస్తూ, అందరికీ అడిగి తెలుసుకొని ప్రతి పథకాలు ప్రజలందరికీ కచ్చితంగా అందాలని నాయకులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, బోండ్ల సంతోష్, నేల కంటి వాసు, లింగంపల్లి శివ, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ అగర్వాల్, వెంకటరామిరెడ్డి, రమణ, జిమ్మీ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ



**మెట్‌పల్లి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని రేగుంట లో బుధవారం ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని,తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 3 కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యాన్ని ఇవ్వనున్నామని అన్నారు.సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎడ్మాల లక్ష్మారెడ్డి ట్రస్ట్ చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి,పట్టణ మాజీ అధ్యక్షులు ఖుతుబొద్దీన్ పాషా,ఆర్ఐ ఉమేష్,రేగుంట వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ

**జుక్కల్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
కామారెడ్డి మద్నూర్ మండలం కేద్రం లో ని రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ తనిఖీ చేసిన మద్నూర్ మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్ రాష్ట్ర ప్రభు త్వం నిన్నటి నుండి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టింది దాంట్లో భాగంగా మండలంలోని వివిధ రేషన్ షాపులలో పంపిణీ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ తనిఖీ చేశారు. ప్రజలకు సరఫరా చేస్తున్నా తీరును పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఎలాంటి సమస్య రాకుండ సక్ర మంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశిం చారు.తహసీల్దార్ వెంట మండల గిర్దవార్ ఎం శంకర్ ఉన్నారు.



# అక్రమ పశువుల వాహనాలను ఎలా విడిచిపెట్టారు

**బీజేపీ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్**



**నేరడిగొండ, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
ఇటీవల అక్రమంగా పశువులను తరలిస్తున్న 4 ఐచర్, 3 బొలెరో వాహనాలలో 3 ఐచర్, 2 బోలెరోలను ఏ చట్టం ప్రకారం విడిచిపెట్టారో నేరడిగొండ ఎస్సై, ఇచ్చోడ సీఐ సమాధానం చెప్పాలని గుడిహత్నూర్ మాజీ జడ్పిటిసి పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన ఉదయం అక్రమంగా పశువులను తరలిస్తు న్నారని హిందూ సంఘాల నాయకులకు సమాచారం అందడంతో వారు స్థానిక ఎస్సైకు సమాచారం అందిం చినా వారు స్పందించకపోవడంతో, మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల సహాయంతో అట్టి వాహనాలను ఆపడం జరిగిందని, అనంతరం ఎస్సై గారికి మరోమారు హిందూ సంఘాల నాయకులు ఫోన్ చేసిన స్పందించక పోవడంతో పోలీసు లతో ఎస్సైకు సమాచారం అందించారు. కొంతసేపటి తర్వాత ఎస్సై రావడంతో ఆయనతో హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆ వాహనాలలో మోతాదుకు మించిన పశువులు ఉన్నాయని, తప్పుడు కాగితాలు ఉన్నా యని ఎస్సైకు ఫిర్యాదు చేసి అక్కడి నుండి వెళ్లిపోయారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను స్వాదీ.నం చేసుకున్న ఎస్సై తర్వాత వాటిని వదిలిపెట్టి రెండు రోజుల తర్వాత హిందూ యువకులపై తప్పుడు కేసులు బనాయించారని అన్నారు. ఏ రకంగా ఆ వాహనా లను విడిచిపెట్టారో ఎస్సై, సిఐలను అడిగితే మాటను దాటవేస్తున్నారే తప్ప జవాబు ఇవ్వడం లేదన్నారు. తప్పుడు కేసులు బనాయించి ఎవరి మెప్పు పొందాలని చూస్తు న్నారని ప్రశ్నించారు. పోలీసు అధికారులకు నాలుగు రోజు ల సమయం ఇస్తున్నామని ఏ విధంగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను విడిచిపెట్టారో చెప్పా లని లేనియెడల 4 రోజుల తర్వాత హిందూ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరి ంచారు. విశ్వ హిందూ పరిషత్, బజ రంగ్ దళ్, హిందూ వాహిని, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి గర్హనీయం




**సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూ ముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న విద్యా ర్థులపై ఈరోజు పోలీసులు చేసిన లాఠీచార్జిని ఖండిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ సబ్ క్యాంపస్ లో పీ.డీ.ఎస్.యు,ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పీ.డీ. ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ ,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభు త్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు వేలం వేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. యూని వర్సిటీలో జీవవైవిధ్యం గల అడవి ఉందని, దీనిలో వివిధ రకాల పక్షులు, జింకలు, కుందేల్ల లాంటి వన్య ప్రాణులు అనేకం ఉన్నా యని , జీవవైవిధ్యం గల ఈ అడవిని విధ్వంసం చేయడానికి రేవంత్ ప్రభుత్వం పూకుంటుందని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ గత నాలుగు రోజుల నుండి హెచ్సీయూ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఈరోజు వారిపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి తీవ్రమైన లాఠీ చార్జ్ జరిపిందని, భూములను కాపాడాలని కోరుతున్న వారందరి పైన అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన ఏడవ గ్యారంటీ ప్రజాస్వామిక పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే విద్యార్థుల పైన మోపిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలని ,యూని వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూ ములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను, పీ.డీ.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్య దర్శి గ్యార గణేష్ ,నాయకులు శివకుమార్, నరేష్ ,శివ, అభి, శ్రీకాంత్, చంద్రశేఖర్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

## అతివలకు అండగా ఆదిలాబాద్ షి టీం

**- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

**అదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**



అతివలకు అండగా ఆదిలాబాద్ షీ టీం బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉండనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజాన్ ఐపీఎస్ తెలియజేశారు. మహిళలు, విద్యార్థిని లకు ఉద్యోగస్థలాల నందు కళాశాలల నందు ఎలాంటి సమస్యలున్న వేధింపులు ఉన్న జిల్లా షీ టీం బృందాలను సంప్రదించాలని తెలిపారు. షీ టీం బృందాలని సంప్రదించడానికి 24 గంటలు పని చేసేలా ఒక మొబైల్ నెంబర్ను 8712659953 తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు గత నెలల నందు 34 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా ఫిర్యాదులు అందిన వాటిలో మూడు ఈ పెట్టి కేసులు మరియు మావల పోలీస్ స్టేషన్ నందు ఒక ఎఫ్ఐ ఆర్ నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఈ ఐదుగురు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా గల అన్ని పాఠశాలలు కళాశాలలో ప్రతిరోజు అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థినిలకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై, మహిళలపై సైబర్ నేరాలు జరుగు పద్ధతులను, మహిళా చట్టాలపై, నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్య పరిచయం జరుగుతుందని తెలిపారు.

## 4న మెదక్‌లో విద్యుత్ గ్రీవెన్స్ డే

**- జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ శంకర్**

**మెదక్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**



మెదక్ పట్టణంలోని జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఏప్రిల్ 4న సి.జి.ఆర్ .ఎఫ్ (కస్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ ) హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు మెదక్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెడింగ్ ఇంజనీర్ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి హజరయ్యేవారు ఆధార్ కార్డు, కరెంటు బిల్లు రసీదు తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు చెప్పారు. మెదక్ డివిజన్ మరియు తూప్రాన్ డివిజన్ పరిధి లోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## సర్వాయి పోరాట స్పూర్తితో ముందుకెళ్లాలి



**నిజామాబాద్, జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి రాచరిక వ్యవస్థలోని దౌర్జన్యాలను ఎండగడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నులు లేని వ్యవస్థను నెలకొల్పి గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, సి.గంగాధర్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ గౌడ్, గౌడ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య గౌడ్, నాయకులు చెరకు లక్ష్మణ్ గౌడ్, రత్నాకర్ గౌడ్, తాళ్లపల్లి రాజా గౌడ్, సేపూరి సుమన్ గౌడ్, నాగరాజు గౌడ్ బండి సాయా గౌడ్ మాజీ కార్పొరేటర్ ఉమా శ్రీని వాస్ గౌడ్, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
ఎ జాతీయ జెండాను ఎగురవేయడానికి యత్నించిన కాంగ్రెస్? నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన బుధవారం నగరంలో చోటు చేసుకుంది. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జాతీయ జెండా ఎగుర వేయడానికి యత్నించారు. అయితే అనుమతి తీసుకోకుండా జెండా ఎగురవేస్తున్నారని బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కాంగ్రెస్? నాయకులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు కాంగ్రెస్? నాయకులు జాతీయ జెండా ఎగురవేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని.. ఈ ఉద్దేశ్యంతో జెండా ఆవిష్కరణ చేపట్టామన్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా గద్దె నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. చివరికి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు శేఖర్, నరాల రత్నాకర్, 50వ డివిజన్ ఇన్‌ఛార్జి అవీన్ ధర్మారం, ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
ఏప్రిల్ 3, 2025
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# సంక్షేమ పథకాల అమలే కాంగ్రెస్ లక్ష్యం

## డిసిసి నాయకులు నాగరాజ్ గౌడ్



**కామారెడ్డి/బీబీపేట్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రూపొందించిన ప్రతిష్టాత్మక రాజీవ్ యువ వికాసం పథకానికి భారీ స్పందన లభిస్తోందని అయన అన్నారు రాష్ట్రంలో నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపొందించిన ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం 3 లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేయనుందని ఇందులో 60 శాతం నుంచి 80 శాతం వరకు రాయితీ లభిస్తుందన్నారు దాదాపు 5 లక్షల మందికి 6,000 కోట్ల మేర ఈ రుణాలను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని అర్హులైన ప్రతి ఒక్కరు ఏప్రిల్ 14 వరకు దర ఖాస్తులు చేసుకోవచ్చున్నారు.దేశంలోనే ఎక్కడ లేని విధం గా తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ అమలు చేయడం రాష్ట్ర జనాభాలో 85 శాతం మంది పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని పేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలని సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం హర్షణీయమన్నారు నిరుద్యోగ యువతకు ప్రోత్సాహకంగా రాజీవ్ వికాసం, పేదలకు కడుపునిండా అన్నం పెట్టేందుకు సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రివర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు.

**సర్వాయి పాపన్న గొప్ప బహుజన చక్రవర్తి..**

బీబీపేట్ మండలం మాందాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ గారి వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు నారాగౌడ్, కిష్టాగౌడ్ వెంకట్ స్వామి గౌడ్, నర్సగౌడ్ నాగరాజ్ గౌడ్, బోప్పన్న గౌడ్ ,శ్రీమాన్ గౌడ్ ,అభి గౌడ్ కుమారస్వామి గౌడ్, కార్తీక్ గౌడ్ పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా జీఎంకు సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు కొత్తగూడెం ఏరియా జిఎం ఎం.షాలేం రాజుని బుధవారం కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఎం.వి.నరసింహారావు కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘ సభ్యులు అందరూ సన్మానించడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరి యాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరి యాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో ఉద్యోగస్తులు అధికారులు యూనియన్ ప్రతినిధులు ఎవరికి వారు వారి వారి కేటా యించిన పనులలో రక్షణతో నిర్వ ర్తించి ఏరియాను నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోగలిగామని అన్నారు.ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరాలలో కూడా నిర్దే శించిన లక్ష్యాన్ని రక్షణతో పూర్తి చేయాలని సంస్థ అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించి కృషిచేయాలని సింగరేణి సంస్థను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని ఈ సంద ర్భంగా ఆయన కొత్తగూడెం ఏరియా ఉద్యోగులకు అధికారులకు యూనియన్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సీఎంఓఎఐ ప్రెసిడెంట్ ఎం.వి నరసింహారావుతో పాటు వైస్ ప్రెసిడెంట్ రమేష్, అజ్మీర శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ఏ. ఉపేందర్ బాబు, కొత్తగూడెం ఏరియా సీఎంఓఎఐ సభ్యులు పాల్గొన్నారు.

# బహుజనుల కోసం పోరాడిన సర్వాయి

## - బీజేపీ కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి



**కుకునూరుపల్లి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** బడుగు బలహీనవర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా, సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి, ఓబీసీ మోర్చ అధ్యక్షులు డాకురి కుమారస్వామి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ గర్నపెల్లి కృష్ణమూర్తి పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కౌన్సిలు మెంబర్ గౌరారం కృష్ణ, మండల పార్టీ జనరల్ సెక్రెటరీ దాసరి స్వామి, ఉపాధ్యక్షులు బోనాల రాజు, మోర్చ అధ్యక్షులు గుర్రాల స్వామి, వి హెచ్ పి అధ్యక్షులు నంద కిషోర్ శర్మ పంతులు, బూత్ అధ్యక్షులు కనకయ్య, ఈగ శ్రీనివాస్, సీనియర్ కార్యకర్తలు మంద రాజు, బాలనర్సు, సూర్ణ రమేష్, పాపగౌని క్రాంతి గౌడ్, బోనగిరి చందు, అఖిల్, లస్కరి కిరణ్ తదితరుల పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

**కామారెడ్డి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**



యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామారెడ్డిలో బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్ ఆవిష్కరణలో భాగంగా అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం, నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీ-ఎన్ఏబి ) ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడ మిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. విశ్వప్రసాద్, ఐక్యుఏసి కోఆర్డినేటర్ అంకం జయప్రకాష్, ఎన్సిసి అధికారి లెఫ్ట్నెంట్ డాక్టర్ ఏ. సుధాకర్, వృక్షశాస్త్ర విభాగా ధిపతి డాక్టర్.దినకర్ చిన్న, పిడి డాక్టర్ జి. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**సొనాల, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** ఆదిలాబాద్ జిల్లా ప్రజలతో పాటు, తెలంగాణ ప్రజలందరికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ లో ఏర్పాటు చేయ తలపెట్టిన పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలిపినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇంతకుముందు మామునూర్ ఎయిర్ పోర్టుకు అనుమతులు సాధించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు.. భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు సాధించడంపట్ల ఆయన హర్షంవ్యక్తం చేశారు. ఆరు నెలల స్వల్పవ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు సాధించడం.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

అదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు (లేఖ సంఖ్య: 5608/ఎయిర్ పోర్ట్స్/2024, తేదీ: 18.12.2024) భారత వాయుసేన వాయుసేన అధికారులు.. సమ-ఎఖతవ్యక్తం చేయడంతో పాటు.. అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అంతేకాదు, తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులు మంజూరీ చేస్తున్నట్లు వాయుసేన అధికారులు లేఖ ద్వారా తెలిపినట్టు ఆయన వివరించారు.

ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికి ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్టు తెలిపిన మంత్రి.. పౌర విమానాల రాకపో కలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం చేయడం, పౌర టర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ (విమానాలు నిల్పేవడానికి, మలుపులు తిరగడానికి మరియు ఇతర విమానయాన కార్యకలాపాలకు ఉపయోగించే నిర్దిష్ట ప్రాంతం) వంటి ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

# 'పాదయాత్రలను' విజయవంతం చేయండి

**జుక్కల్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** రాష్ట్ర పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు మద్నూర్ మండలంలో చేపట్టబోయే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలను ప్రతి గ్రామంలో విజయవంతం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని గ్రామాల వారిగా చేపట్టే పాదయాత్ర షెడ్యూల్ను మండల పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు ప్రకటించారు. పాదయాత్ర షెడ్యూల్ ఈ విధంగా ఉన్నాయి. ఈనెల 3. న చిన్న షక్కర్గా, సలాబత్పూర్, కేలూర్, ఈ నెల 4, న తడి ఇప్పర్గా, గోజేగావ్, మేనూర్, శాఖాపూర్,5. న సుల్తాన్ పేట్, లచ్చన్, రూసేగావ్, రాచూర్,7. న పెద్ద ఎక్లారా, ధనుర్ ,సోమూర్,8. న చిన్న తడగూర్, పెద్ద తడుగూర్, ఖరగ్, ఆవల్గావ్, 9. న చిన్న ఎక్లారా, కొడిచరా, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రామ్ పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, కొండ గంగాధర్, బండి గోపి, తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఎడపల్లి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** బుధవారం జానకంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను ముఖ్య అతిథి ఎడపల్లి తహసీల్దార్ కే. ధన్వాల్, సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్, సొసైటీ డైరెక్టర్లు , రైతులు , సంఘ సభ్యులు మరియు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మిద్దె నరేందర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని బయట వ్యక్తులకు అమ్మి మోసపోకుండా, సొసైటీ కి వరి ధాన్యాన్ని అమ్ముకొని, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరను పొందాలని, తద్వారా రైతులు లాభపడాలని సొసైటీకి సహకరించాలని కోరారు.

# టైల్స్ అందజేత

**చేగుంట, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట పట్టణ కేంద్రంలో గల సీతారామ కాలనీలో షెడ్డు కు 650 ఎస్ఎఫ్ టి టైల్స్ బహుకరించిన పరంజ్యోతి. చేగుంట మండలం కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న సీతారామ కాలనీలో కాలనీవాసుల కోరిక మేరకు 650 ఎస్ఎఫ్టి టైల్స్ ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి బహుకరించారు. కాలనీలో ఉన్న షెడ్డులో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా కాలనీవాసుల కోరిక మేరకు 650 టైల్స్‌ను అయిత పరంజ్యోతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్స్ అన్నం శ్రీలత రవి, సంద్రుగు రవి, సీసీ శంకర్ కిషన్,కటిక శీను తదితరులు ఉన్నారు.

# రక్తదానం అందించిన సానిక్షా ఫౌండేషన్

**చేగుంట, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట మండలం, గాజులవాయి తండా కు చెందిన మౌనిక కు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీ సమయంలో అత్యవసర ముగా ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం ఉండడం తొ సానీక్ష ఫౌండేషన్ కు సభ్యుడు శేఖర్ మెసేజ్ చేసిన వెంటనే స్పం దించి రక్త దానం చేసిన పోచయ్య మరియు రాజు గార్లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసిన సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు డి శివ అభినందనలు తెలియజేసిన మౌనిక కుటుంబసభ్యులు.

# ఐకెపి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సిరికొండ, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించిన సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాకారం రవి. సిరికొండ మండలం కొండూరు గ్రామములో బుదవారం కాంగ్రెస్ అధ్యక్షులు బకారం రవి, ఐకెపి ఏపీఎమ్ కిరణ్ కుమార్ లు కొబ్బరి కాయ కొట్టి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాకారం రవి, కొండూరు గ్రామ శాఖ అధ్యక్షులు గోగు సురేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మగ్గిడి రాంరెడ్డి, మగిరి సదానందం రెడ్డ ,నార్మల భాస్కర్ రెడ్డి ,క్యాష్ పురం భాస్కర్ రెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ మైపాల్, అన్నం సుదర్శన్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు ఐకెపి సత్యరాజ్ , మహిళా సంఘం సభ్యురాలు పాల్గొన్నారు.

# ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):** ఆయుష్ డిపార్ట్మెంట్లో ఫార్మసిస్ట్ గా చేసిన వారితో కాళీ పోస్టు లను భర్తీ చేయాలనీ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య తెలిపారు తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్మెంట్ సంబంధం లేని వారితో ఫార్మసీలో బీఫార్మసీ ,డి ఫార్మసీ చేసి యునాని, ఆయుర్వేదంలో ఎలాంటి అనుభవం లేని వారితో ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేని తెలిపారు. ఆయుష్ రంగంలో డిప్లమో కోర్సులు ప్రవేశపెట్టి రెండు సంవత్సరాలు శిక్షణ ఇచ్చి నైపుణ్యత పొందినటువంటి, చదువుకున్నటువంటి వారిని ఉద్యోగంలో భర్తీ చేయడం ద్వారా అనారోగ్యాలతో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సరైన మందులు ఇచ్చి వారి ఆరో గ్యాలను బాగు చేయడానికి దోహదపడతారని కానీ ఆయుర్వేదంతో సంబంధం లేన టువంటి వారిని రిక్రూట్ చేయడానికి ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు.

గురువారం
ఏప్రిల్ 3, 2025
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM


# సన్న బియ్యం పంపిణీ సాఫీగా జరగాలి

## నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**నిజామాబాద్, జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల 21వ నెంబర్ రేషన్ షాపును కలెక్టర్ బుధవారం సందర్శించి, లబ్దిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ ఉందా అని పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తన వెంట ఉన్న అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నా రు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,012 మంది సభ్యులకు ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీ యాదవ్ ఉన్నారు.

**ఎల్ఆర్ఎస్ రిబేటు గడువు పొడిగింపు ..**
అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం



**తూప్రాన్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
శ్రీ సూర్య చంద్ర ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి కాలం గురించి మంగళవారం రోజు సుభాష్ వద్ద “అంబలి పంపిణీ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ అంబలి కేంద్రం ప్రతి రోజు ఉదయం 11.00గం. నుండి 12.00 గం.లవరకు ఒక గంట సేపు కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం రోజు నుంచి ప్రారంభమైన ఈ వేసవికాలంలో ప్రతిరోజు ఈ అంబలి కార్యక్రమాన్ని శ్రీ గణేష్ బట్టలు దుకాణం యజమాని శివరామ్ దేవసాయి వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ నాయకులు ఆకుల శ్రీరాములు, స్వర్గం వెంకట నారాయణ, ఎక్కళ్ దేవ్ వెంకటేష్ యాదవ్, జంగం రాములు, గణపతి టెక్స్ టైల్స్ బట్టల దుకాణం యజమాని శివరామ్ దేవసాయి, అతని కుమారులు, షాప్ సిబ్బంది, సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్నకు ఘన నివాళి



**కామారెడ్డి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ వారు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ విక్టర్, అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్ (లోకల్ బాడి), హాజరు అయ్యారు. కలెక్టర్ సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. తరువాత గౌరవ కలెక్టర్ మాట్లాడుతూ, సర్వాయి పాపన్న వరంగల్ జిల్లాలో జన్మించడం జరిగినదని. భువన గిరి స్థానంగా ఎన్నో పోరాటాలు చేసి సమ సమాజ స్థాపన కోసం, బడుగు, బలహీన అభ్యున్నతికి పోరాటం చేసిన మహనీయుడు అని చెప్పడం జరినది. తరువాత గౌడ సంఘ ప్రతినిధులు మరియు ఇతర సంఘాల నాయకులు పూలు అర్పించి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ చక్రధర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్, పవన్, స్వప్న, సునీత, రాజేశ్వర్ మిగతా ఆఫీస్ సభ్యులు, గౌడ సంఘ నాయకులు రాజాగౌడ్, తిరుమల గౌడ్, కల్లు గీత కార్మికులు, సంఘ నాయకులు మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్



**కామారెడ్డి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకమును కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ప్రజా పంపిణీ దుకాణం 14 కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా పంపిణీ దుకాణం సందర్శించి సన్న బియ్యం పథకము ప్రారంభించారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రజా పంపిణీ దుకాణాలలో అధికారులతో ఆర్డీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారి, సహాయ పౌర సరఫరాల అధికారి, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దారులు, డిటిసిఎస్, ఆర్ఐలతో తనిఖీలు చేయించారు. అందులో భాగంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులందరూ కడుపునిండా తింటున్నామని వారి యొక్క సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## మైనంపల్లిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**తూప్రాన్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు ఓ ప్రైవేట్ ఫంక్షన్ కార్యక్రమానికి వచ్చిన మైనంపల్లిని కలిశారు మాజీ కౌన్సిలర్ రఘుపతి గరిగే నర్సింగ్ రావు ధనరాజ్ సమీర్ ఆజాద్ శశిభిషన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నాగులపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు



## పాత్రికేయుడికి పలువురి పరామర్శ



**సోనాల, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
బోథ్ మండల సీనియర్ పాత్రికేయులు రాథోడ్ దేవిదాస్ నాన్న ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ బుధవారం రోజు సోనాల మండలంలోని సాకేర గ్రామంలో గల వారి నివాసంలో నాయకులతో కలిసి దేవిదాస్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట ఆయా మండలాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**మార్కెట్ కమిటీ చైర్మన్ పరామర్శ..**
బాధిత కుటుంబానికి పరామర్శ సోనాల మండలంలోని సోనాల గ్రామానికి చెందిన రిపోర్టర్ రాథోడ్ దేవిదాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి బాధిత కుటుంబానికి పరామర్శించారు .మృతికి గల గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ,పి ఎ సీ ఎస్ డైరెక్టర్లు గొల్ల రాజు, అబ్రాహార్,మైనార్టీ నాయకులు రైముద్దీన్, అబుద్ ,పాల్గొన్నారు

**ప్రెస్ క్లబ్ సభ్యుల పరామర్శ..**
సోనాల మండలం సాకేర గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు రాథోడ్ దేవదాస్ గారి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించడం తో తో బోథ్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఇంటికి వెళ్లి పరమర్శించి మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు..

**రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ..**
**బోథ్. ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
సోనాల మండలం సాకేర గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు రాథోడ్ దేవదాస్ తండ్రి చనిపోయారనే విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారి ఇంటికి వెళ్లి పరమర్శించి మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

## ముర‌ళి మృతి శ్రామిక వర్గానికి తీరని లోటు

**సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య**




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జెల్ల మురళి నిన్న మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్యలు మాట్లాడుతూ మురళి మరణం శ్రామిక జనానికి తీరనిలోటని అన్నారు న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ దాసు, జిల్లా అధ్యక్షులు బి భూమన్న , తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, న్యూడె మోక్రసీ డివిజన్, నగర కార్యదర్శులు పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు ఏం శివకుమార్, సత్యం, రమేష్, భాస్కర్, జేపీ గంగాధర్, నిజా మాబాద్ రూరల్ నాయకులు ఎర్రన్న, నరసయ్య , మల్లిఖార్జున్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయి రెడ్డి , పిఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి భారతి, నాయకురాలు లక్ష్మి, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు గౌతం, ప్రిన్స్, రైతు నాయకులు నడిపి భూమయ్య, ప్రజాపంత జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐ నాయకులు రాజన్న, రాజిరెడ్డి, రాజశేఖర్ కుటుంబ సభ్యులు వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి పట్టణంలో భారీ చోరీ



**మెట్‌పల్లి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
పట్టణంలోని సాయిరాం కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.సాయిరాం కాలనీలో నివాసం ఉంటున్న ఎల్దాస్ శ్యావల బోయిన్ పల్లి లో ఏఎన్ఎం గా పనిచేస్తున్నారు. సోమ వారం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చి చూడగా ఇంటి మెయిన్ డోర్ పగలగొట్టి ఉంది.లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం అయ్యి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు.13 తులాల బంగారు ఆభరణాలు,20 తులాల వెండి పట్ట గొలుసులు,కడియాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.మెట్ పల్లి డిఎస్పి రాములు,సిఐ అనిల్ కుమార్ సంఘటన స్థలానికి క్లూస్ టీం తో వెళ్లి పరిశీలించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

## మత్తు పదార్థాల కేసులో నిందితుడి అరెస్ట్

**- కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర**

**కామారెడ్డి క్రైమ్, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
కామారెడ్డి జిల్లాలో అల్ప్రాజోలం రాకెట్ ను బిచ్కుంద పోలీసులు ఇది వరకే పట్టుకున్న సంగతి విధితమే. 263 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకోవడంతో పాటు గతంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండు కు తరలించడం జరిగింది. ఆ కేసులో నిందితుడు శ్రీనివాస్ గౌడ్ పరారీలో ఉండగా బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఎ 4 గా ఉన్న నిందితుడు శ్రీనివాస్ గౌడ్ హైదరాబాదు నుండి ఎ3 బొడ్డు కృష్ణ నుండి టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ ద్వారా ప్రభుత్వ నిషేధిత అల్ప్రజోలమ్ కొనుగోలు చేసి అతనికి సంబంధించిన కల్లు దుకాణంలోని కల్లులో ఈ నిషేధిత మత్తు పదార్థాన్ని కలిపి అమ్మి అధిక లాభాలు సంపాదించి ప్రజల ప్రాణాలకు హాని కలిగే విధమైన చర్యలకు పాల్పడ్డాడు. కావున నిందితుడు శ్రీనివాస్ గౌడ్ ను పట్టుకొని రిమాండ్ తరలించడం జరిగిందనీ, తన వద్ద నుండి ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్పి తెలిపారు. మత్తు పదార్థాలు కలిగి వున్న, సరఫరా చేసిన, అమ్మిన, వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు.

## రేషన్ షాపుల తనిఖీ

**నిజామాబాద్, జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (ప్రజా శంఖారావం):**
జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలో గల పలు రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభు త్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన నేపథ్యంలో, లబ్దిదారులకు సజావుగా బియ్యం పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. 23, 31 నెంబర్ రేషన్ షాపులను సందర్శించి, బియ్యం పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంకా ఎంత మందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంతరాలు తావులేకుండా సజావుగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని రేషన్ డీలర్లు సంధ్యారాణి, గంగామణిలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
ఏప్రిల్ 3, 2025
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

### టీమిండియా సొంతగడ్డపై
## సిరీస్‌ల వేదిక, తేదీల ప్రకటన

ఈ ఏడాదికి సంబందించి బీసీసీఐ.. టీమిండియా పురుషుల జట్టు హోమ్ షెడ్యూల్ ను మంగళవారం ప్రకటించింది. వచ్చే జూన్ లో ఇంగ్లాండ్ పర్యటన తర్వాత వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సొంతగడ్డపై టీమిండియా మ్యాచ్ లను ఆడనుంది. తాజాగా దీనికి సంబంధించిన షెడ్యూల్ ను వెలువరించింది. అక్టోబర్ నెలలో ఇండియాలో హోం మ్యాచ్ లు జరుగుతాయి. అహ్మదాబాద్ లో వెస్టిండీస్ తో జరిగే తొలి టెస్టుతో హోం మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 2-6 వరకు తొలి టెస్టు, అదేనెల 10-14 వరకు కోల్ కతాలో రెండో టెస్టు జరుగుతుంది. ఆ తర్వాత కాస్త విరామం తర్వాత ఇండియాలో సౌతాఫ్రికా టూర్ మొదలు కాబోతోంది. ఈ సిరీస్ లో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లను భారత్, సౌతాఫ్రికాలు ఆడనున్నాయి. ఇక గువాహటిలో తొలిసారి టెస్టు మ్యాచ్ ను నిర్వహించనున్నారు.

## సద్దుమణిగిన వివాదం


### హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ వివాదం ఎట్టకేలకు పరిష్కారం

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య చెలరేగిన వివాదం ఎట్టకేలకు క్లియర్ అయింది. ఇరువర్గాల ప్రతినిధుల మధ్య భేటీలో సమస్య పరిష్కారమైంది. అసలేం జరిగిందంటేహైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య చెలరేగిన టికెట్ల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో హెచ్‌సీఏ బెదిరిస్తోందని..ఇలా చేస్తే హైదరాబాద్ వదిలి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదే అదనుగా ఎస్ఆర్‌హెచ్ జట్టును ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది. చిలికి చిలికి గాలివానలా మారిన ఈ వివాదానికి ఇప్పుడు శుభం కార్డు పడింది. ఇవాళ హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్, బీసీసీఐ ప్రతినిధులు భేటీ అయ్యారు. ముగ్గురి మధ్య జరిగి త్రైపాక్షిక ఒప్పందం మేరకు నడుచుకునేందుకు అటు ఎస్ఆర్‌హెచ్ ఇటు హెచ్‌సీఏ ప్రతినిధులు అంగీకరించారు. దాంతో ఇకపై ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఎలాంటి ఆటంకం ఉండదు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్ దేవరాజ్ నేతృత్వంలో చర్చలు జరగగా ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్‌లు ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ త్రై పాక్షిక ఒప్పందం ప్రకారం స్టేడియంలోని అన్ని కేటగిరీల్లో 10 శాతం టికెట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చాలా కాలంగా ఆచరిస్తూ వస్తున్నట్టే ప్రతి కేటగరీలో పాస్ విధానం కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిపాదించింది. ఎస్ఆర్‌హెచ్ సీఈవో షణ్ముగంతో ఫోన్ సంప్రదింపుల తరువాత 3900 కేటగరీ కాంప్లిమెంటరీ పాస్ విధానంలో ఎలాంటి మార్పులు ఉండవని తేలింది. ఎస్ఆర్‌హెచ్‌తో ప్రొఫెషనల్‌గా పూర్తిగా సహకారం అందించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంగీకారం తెలిపింది. గతంలో నెలకున్న వివాదాలు ఇక ముగిసినట్టేనని హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ సంయుక్తంగా ప్రకటించాయి.

## పంత్ పై గోయెంకా సీరియస్

మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో ప్రస్తుత సీజన్?లో పంజాబ్ వరుసగా రెండో విజయం నమోదు చేయగా, లఖ్?నవూకు మూడు మ్యాచ్?ల్లో రెండో ఓటమి. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం లఖ్?నవూ కెప్టెన్ రిషభ్? పంత్ ఆ ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గోయెంకా మధ్య సంభాషణ వైరల్‌గా మారింది. ఈ ఇద్దరి మధ్య చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్?గా మారింది. తాజా ఓటమి తర్వాత పంత్? పట్ల సంజీవ్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పంత్?ను మైదానంలో అందరిముందే జట్టు ఓటమికి గల కారణాలు అడిగినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో కనిపిస్తోంది. దీంతో లఖ్?నవూ ప్రదర్శన పట్ల సంజీవ్ సంతృప్తిగా లేరని, అందకే పంత్?ను సీరియస్ మందలించారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అంతేకాకుండా అతడనికి బాగా తిట్టి ఉంటాడని అభిప్రాయపడుతున్నారు.

### ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు హగ్‌తో
## ఆకాశానికెత్తిన ప్రీతిజింటా



ఐపీఎల్ 2025 లో భాగంగా 13వ మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరిగింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో టీం 172 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నో బౌలర్లపై విధ్వంసం సృష్టించాడు. అతను కేవలం 34 బంతుల్లో 202 స్ట్రైక్ రేట్‌తో 69 పరుగులు చేశాడు. ఈ సమయంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఒక ఫోర్ కొట్టడం అందరికీ లగాన్ సినిమాను గుర్తు చేసింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇన్నింగ్స్ మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది మాత్రమే కాదు, ఈ ఇన్నింగ్స్‌లో, ప్రభ్‌సిమ్రాన్ లక్నోలో అత్యంత వేగవంతమైన అర్థ సెంచరీ సాధించిన రికార్డును కూడా సృష్టించాడు. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతిజింటా నుంచి ఓ హగ్ కూడా అందుకున్నాడు. దీంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. పంజాబ్ కింగ్స్ తరపున ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ మొదటి ఓవర్లోనే 1 ఫోర్, 1 సిక్స్ కొట్టడం ద్వారా తన వైఖరి ఏంటో చూపించాడు. ఆ తరువాత ఏమాత్రం ఆగలేదు.

# బట్లర్ ఊరమాస్ ఇన్నింగ్స్

### సొంత మైదానంలో చిత్తుగా ఓడిన ఆర్‌సీబీ..




ఐపీఎల్ 14వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి ఓటమిని చవిచూసింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఎం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 8 వికెట్లు కోల్పోయి కేవలం 169 పరుగులు మాత్రమే చేసింది.ఐపీఎల్ 14వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి ఓటమిని చవిచూసింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఎం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 8 వికెట్లు కోల్పోయి కేవలం 169 పరుగులు మాత్రమే చేసింది. 170 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కేవలం 17.5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ రీచ్ అయింది. గుజరాత్ టైటాన్ తరపున జోస్ బట్లర్ (60) హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. అలాగే ఓపెనర్ సాయి సుదర్శను (49) కూడా తన క్లాస్ ఆటతో ఆకట్టుకున్నాడు. అలాగే ఇంపాక్ట్ ప్లేయర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ భారీ సిక్సర్లతో ఛేజింగ్‌ను ఈజీగా మార్చేశాడు. శుభ్మన్ గిల్ కేవలం 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఆర్‌సీబీ బౌలర్లలో భువీ, జోస్ తలో వికెట్ పడగొట్టారు.ఆర్‌సీబీ తరపున లియామ్ లివింగ్‌స్టోన్ (54 పరుగులు) అర్ధ సెంచరీ సాధించాడు. జితేష్ శర్మ 33, టిమ్ డేవిడ్ 32 పరుగులు చేశారు. మహ్మద్ సిరాజ్ 3 వికెట్లు పడగొట్టాడు. సాయి కిషోర్ 2 వికెట్లు తీశాడు. అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ తలో వికెట్ తీశారు.

## స్టేట్ టీమ్ నుంచి మారాలనుకుంటున్న

### ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ యశస్వి లేఖ



భారత జట్టులో సంచలన ప్లేయర్ యశస్వి జైస్వాల్. ఓపెనర్‌గా దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శిస్తుంటాడు. అయితే ఈ భారత యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ కీలక నిర్ణయం తీసకున్నాడు. దేశవాళీ క్రికెట్ లో తన స్టేట్ టీమ్ నుంచి మారాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ లేఖ రాశాడు."మా నుంచి అతడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరాడు. గోవాకు మారాలనుకుంటున్నట్లు తెలిపాడు. ఇది అతడి వ్యక్తిగత నిర్ణయం." అని ఎమ్‌సీఏ తెలిపింది. అలానే జైశ్వాల్ కు దగ్గరగా ఉన్న ఓ ప్రతినిధి కూడా ఈ విషయాన్ని కన్ఫామ్ చేశారు. కాగా, 2025-26 సీజన్ లో జైశ్వాల్ గోవా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరిస్తాడని సమాచారం అందింది.టీమిండియా క్రికెటర్లందరూ అంతర్జాతీయ మ్యాచులు లేని సమయంలో కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గత సీజన్ లో ముంబయి జట్టు తరపున ఆడిన జైశ్వాల్.. రంజీ ట్రోఫీలో జుమ్ము కశ్మీర్ తో జరిగిన మ్యాచులో ఆడాడు. ఆ మ్యాచులో 4,26 పరుగులు చేశాడు. 17ఏళ్ల వయసులో ముంబయి జట్టులోకి వచ్చిడా యశస్వి. 2018-19 సీజన్ లో ముంబయి జట్టు తరఫున రంజీ ట్రోఫీ అరంగేట్రం చేశాడు. 2022 సీజన్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే 83 సగటుతో 498 పరుగులు సాధించాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోరు 181. ఆ సీజన్ లో ముంబయి ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర కూడా పోషించాడు. 2019-20లో విజయ్ హజారే ట్రోఫీలో డబుల్ సెంచరీ బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ క్రమంలోనే టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చి మంచి ప్లేయర్ గా పేరు గాంచాడు. టెస్టుల్లోనూ సూపర్ ఓపెనర్‌గా అవతరించాడు.



## విమర్శలకు సమాధానమిచ్చిన జడేజా..

ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో కాస్త స్ట్రగుల్ అవుతోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో కేవలం ఒక్క మ్యాచ్ లో మాత్రమే గెలిచింది. ఇక చివరి రెండు మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. ముఖ్యంగా వెటరన్లు ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మ్యాచ్ ల్లో గెలిచే ఇంటెంట్ లేకుండా ఆడారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ తో ధోనీ తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ కు రావడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా రవీంద్ర జడేజా ఈ విమర్శలకు సమాధానం అన్నట్లుగా ఒక పోస్టును షేర్ చేశాడు. తాజాగా ఈ పోస్టు నిమిషాల్లో సోషల్ మీడియాలో వైరలైంది. క్రికెట్ అభిమానులు తమకు తోచిన కామెంట్లు పెడుతూ, లైకులు, షేర్లు చేస్తూ వైరల్ చేశారు. ఇంతకీ ఆ పోస్టులో ఏముందంటే.. ప్రస్తుతమున్న గడ్డు కాలం తొలిగిపోతుందనే ఆశాభావ దృక్పథంతో పోస్టు చేశాడు. అయితే మిగతా జట్లు దూకుడే మంత్రంగా ఆడుతున్న నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు కూడా ఆటతీరులో మార్పు చేసుకోవాలని తెలిపాడు. అప్పుడే ఆ జట్టు విజయాల బాట పడుతుందని, మరింత బలంగా పుంజుకోగలదని పుజారా వ్యాఖ్యానించాడు. ఇక చెన్నై తన తదుపరి మ్యాచ్ ను ఈనెల 5న ఢిల్లీ క్యాపిటల్స్ తో ఆడనుంది. చివరి మ్యాచ్ లో సన్ రైజర్స్ పై ఢిల్లీ ఘన విజయం సాధించింది.

## లఖ్‌నవూపై పంజాబ్ ఘన విజయం

ఐపీఎల్ 18వ సీజన్?లో పంజాబ్ కింగ్స్‌కు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మంగళవారం లఖ్‌నవూతో జరిగినమ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని పంజాబ్ 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69), శ్రేయస్ అయ్యర్ (52లి) అర్ధ శతకాలు బాదారు. శ్రేయస్ అయ్యర్? సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ఫినిష్ చేయడం వల్ల హాఫ్ సెంచరీ అందుకున్నాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన లఖ్‌నవూ బ్యాటర్లలో నికోలస్ పూరన్ (44బీ 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) బాది టాప్ స్కోరర్?గా నిలిచాడు. ఆయుష్ బదోని (41బీ 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (28) ఫర్వాలేదనిపించాడు. అబ్దుల్ సమద్ (27), డేవిడ్ మిల్లర్ (19) పరుగులు చేశారు. మిచెల్ మార్ష్ (0), రిషభ్ పంత్ (2) తేలిపోయారు. ఇక పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, ఫెర్గూసన్, మ్యాక్స్‌వెల్, మార్కో యాన్సెన్, చాహల్ తలో వికెట్ తీశారు. లఖ్?నవూ విధించిన టార్గెట్?ను పంజాబ్ కింగ్స్ సునాయాసంగా చేధించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(8) తేలిపోయినా- ప్రభ్‌సిమ్రన్ సింగ్ విధ్వంసకర బ్యాటింగ్ చేశాడు. లక్ష్యాన్ని మరింత చిన్నగా మార్చేశాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ కూడా కలిసి లఖ్?నవూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన మొదటి ఓవర్‌లోనే ఫోర్, సిక్స్ బాది హిట్టింగ్ మొదలు పెట్టాడు. అనంతరం ధనాధన్ బౌండరీలు బాదేశాడు. ఈ క్రమంలో 23 బంతుల్లోనే ప్రభుసిమ్రన్ సింగ్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు.

### రాజస్థాన్ ఖాతాలో
## ఎట్టకేలకో విజయం

రాజస్థాన్ రాయల్స్‌కు ఎట్టకేలకు ఓ శుభవార్త అందింది. ఐపీఎల్ 2025 లో కెప్టెన్, వికెట్ కీపర్ గా బాధ్యతలు స్వీకరించేందుకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంజూ శాంసన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శాంసన్ వేలికి గాయం, శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న తర్వాత ఈ నిర్ణయం వచ్చింది. శాంసన్ ఇప్పుడు తొలిసారిగా ఐపీఎల్ 2025లో రాజస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ సమయంలో, ఏప్రిల్ 5న పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతను జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో మొదటి మూడు మ్యాచ్‌లకు శాంసన్ బ్యాట్స్‌మన్‌గా ఆడేందుకు మాత్రమే అనుమతి ఉంది. ఈ కాలంలో, అతను వికెట్ కీపింగ్, కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో శాంసన్ కేవలం ఒక ఆటగాడిగా మాత్రమే మ్యాచ్ ఆడుతున్నాడు. ఇంతలో, రియాన్ పరాగ్‌ను జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. కానీ, ఇప్పుడు శాంసన్ ఎన్‌సీఏ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. అతను ఇకపై రాయల్స్ తరపున వికెట్ కీపింగ్‌తో పాటు కెప్టెన్‌గా కనిపించేందుకు రెడీ య్యాడు.ఇంపాక్ట్ ప్లేయర్‌గా, శాంసన్ బ్యాట్‌తో బాగా రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 66 పరుగులు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 13 పరుగులు, చెన్నై సూపర్ కింగ్స్‌పై 20 పరుగులు చేశాడు. శాంసన్ లేనప్పుడు, ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శాంసన్ ఐపీఎల్‌లో 4500 పరుగులు పూర్తి చేశాడు.

### ముంబై ఇండియన్స్ బస్సులో
## హల్‌చల్ చేసిన జాస్మిన్ వాలియా



జాస్మిన్ వాలియా రోజ్..ఇప్పుడు క్రికెట్ వీధుల్లో ఈ పేరే చర్చనీయాంశమౌతోంది. ప్రముఖ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే ఈజ్ ఎస్సెక్స్ ఫేమ్ అయిన జాస్మిన్ ఇటీవల టీమ్ ఇండియా క్రికెటర్, ముంబై ఇండియన్స్ సారధి హార్దిక్ పాండ్యాతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతోంది. ముంబై ఇండియన్ సారధి హార్దిక్ పాండ్యా కొత్త గర్ల్ ఫ్రెండ్ ఇప్పుడు నాయిస్ క్రియేట్ చేస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌లలో సందడి చేస్తోంది. హార్దిక్ పాండ్యా ఎక్కడ ఆడుతుంటే అక్కడికి వాలిపోతోంది. నిన్న సోమవారం జరిగిన కేకేఆర్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో తళుక్కుమంది. అంతేకాకుండా కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ఆ టీమ్ బస్సులో ప్రత్యక్షమైంది. స్టాండ్స్ నుంచి ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు సపోర్ట్ చేస్తూ చిల్ చేసింది. దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ 2025 లో కూడా జాస్మిన్ వాలియా ఫోటోలు, వీడియో తొలిసారిగా సోషల్ మీడియాలో వైర్ అయ్యాయి. స్ట్రైప్డ్ షర్ట్, నెర్డీ గ్లాస్‌లో హల్‌చల్ చేయడంతో ఇద్దరి మధ్య బంధంపై వస్తున్న పుకార్లకు బలం చేకూరింది. ఇద్దరూ తమ తమ సోషల్ మీడియా వేదికల్లో ఒకే రకమైన ఫోటోలు షేర్ చేయడాన్ని గమనించిన ఫ్యాన్స్ పుకార్లు ప్రారంభించారు. ఇద్దరూ గ్రీస్‌లో వెకేషన్ గడిపారనే వార్తలు కూడా వచ్చాయి. ఈ ఇద్దరూ షేర్ చేసిన ఫోటోల్లో బ్యాక్‌డ్రాప్ గ్రీస్ నేపథ్యం ఉండటం దీనికి కారణం. గత ఏడాది 2024 జూలైలో విడిపోతున్నట్టుగా హార్దిక్ పాండ్యా, నతాషా స్టాన్ కోవిక్ ప్రకటించాక హార్దిక్ వర్సెస్ జాస్మిన్ బంధంపై పుకార్లు మొదలయ్యాయి. నాలుగేళ్లు కలిసి ఉన్న తరువాత ఇద్దరూ అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని, కలిసి ఉండాలని చాలా ప్రయత్నించినా సాధ్యం కాలేదని ఇది కఠిన నిర్ణయమైనా తప్పడం లేదని ఇద్దరూ ప్రకటించారు. ఇప్పుడు హార్దిక్ పాండ్యాతో తిరుగుతున్నట్టుగా భావిస్తున్న కొత్త గర్ల్ ఫ్రెండ్ జాస్మిన్ వాలియా రోజ్ తమ బంధాన్ని క్లియర్ చేసేసింది. కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ముంబై ఇండియన్స్ టీమ్ బస్ ఎక్కి హల్‌చల్ చేసింది. జాస్మిన్ వాలియా రోజ్ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే టు ఎస్సెక్స్‌తో ఫేమ్ తెచ్చుకుంది. 2017లో హిట్ అయిన బోమ్ డిగ్గీ విత్ జాక్ నైట్ పాటతో ప్రాచుర్యం పొందింది. బిగ్‌బాస్ 13 ఫైనలిస్ట్ ఆసిమ్ రియాజ్‌తో కలిసి 202లో నైట్స్ ఎన్ ఫైట్స్ మ్యూజిక్ వీడియో విడుదల చేసింది.

## అనికేత్ వర్మకు హార్దిక్ స్ఫూర్తి

2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నుంచి యంగ్ ప్లేయర్ అనికేత్ వర్మ వెలుగులోకి వచ్చాడు. ఈ 23ఏళ్ల కుర్రాడు అదిరే ఆటతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. రీసెంట్?గా దిల్లీ క్యాపిటల్స్?పై అనికేత్ 41బంతుల్లోనే 74 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అంతకుముందు లఖ్?నవూపై 276 స్ట్రైక్?రేట్?తో విరుచుకుపడ్డాడు. దీంతో ఒక్కసారిగా అనికేత్?కు ఫుల్ క్రేజ్ వచ్చింది. అయితే స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్య అతడికి స్ఫూర్తిగా నిలిచాడని అనికేత్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించారు. తాను నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లినట్లు హార్దిక్ గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పాడు. ఇంటర్వ్యూల్లో హార్దిక్ మాటలు విన్న అనికేత్ కెరీర్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రిపేర్ అయినట్లు అమిత్ పేర్కొన్నారు.'అనికేత్‌కు 14ఏళ్లు ఉన్నప్పుడు, ఈ న్యూస్ పేపర్‌లో ఓ వార్త చదివాను. ఓరోజు అకాడమీకి వెళ్తున్నప్పుడు అదే స్టోరీని అనికేత్‌కు చెప్పా. అప్పుడే అనికేత్‌లో ఆట పట్ల ప్యాషన్, పరుగుల దాహాన్ని నేను గమనించాను. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక, నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వాను. కానీ, అతడు మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు.



- షాలినీ పాండే

## ఆలియా భట్‌తో
# పోల్చకండి ప్లీజ్

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## చిరంజీవితో వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157-వర్కింగ్ -టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ- ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు-' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు. ఇలా సాంకేతిక వర్గాన్ని పరిచయం చేస్తూ సగిన వీడియ మెగా అభిమానుల్లో జోష్ నింపింది.

## రెండో సినిమా ప్రకటించిన
# నిహారిక

**- సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ**



- నిహారిక

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించ బోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు

## చిరంజీవితో నాని సినిమా

**- అంచనాలను పెంచిన ప్రకటన**

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయెలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.



## అద్భుత చిత్రరాజం..ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PUTTI MURALI,** PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE,PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : **PUTTI MURALI**, TELTEL/2022/85170, EMAIL : prajashankaravam@gmail.com